సంక్షేమంలో తెలంగాణ టాప్

● డబుల్‌బెడ్ రూం ఇళ్ల పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి


భూత్పూర్‌లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్‌: సీఎం కేసీఆర్ కృషి ఫలితంగా దేశంలోని ఏ రాష్ట్రంలో చేపట్టని అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు చేసుకొంటున్నామని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సంక్షేమంలో తెలంగాణను టాప్‌లో నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. నిరుపేదల ఆత్మ గౌరవం నిలిపేందుకే సిద్దాయిపల్లి వద్ద నిర్మించిన రెండు పడక గదుల పట్టాల పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. మున్సిపాలిటీలో ఆదివారం అమిస్తాపూర్ గ్రామానికి చెందిన 288 డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాల పత్రాలను అందజేసి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా నిరుపేదలకు ఒక్కరూపాయి కూడా ఖర్చు లేకుండా అని వసతులతో కూడా ఇళ్ల నిర్మించి ఇస్తున్నట్లు వివరించారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మనిమోని సత్యనారాయణ, ముడా డైరెక్టర్లు చంద్రశేఖర్ గౌడ్, సాయిలు, తహసీల్దార్ చెన్న కిష్టన్న, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం


మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చిత్రపటం అందజేస్తున్న వీరశైవ లింగాయత్‌లు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కర్ణాటక, మహారాష్ట్ర భక్తులతోపాటు లింగాయత్‌లకు ఎంతో పవిత్రమైన అక్కమహాదేవి ఆలయం గుహల వద్ద పర్యాటకంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లాకేంద్రంలో నిర్వహించిన వీరశైవ లింగాయత్ వధూవరుల పరిచయ వేదిక 2023 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మ్యాట్రిమోనీ వెబ్‌సైట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే రూ.1.60 కోట్ల పర్యాటక శాఖ నిధులతో కృష్ణానదిని ఆనుకుని ఉన్న అక్కమహాదేవి గుహ వద్ద మెట్లు, జెట్టి ఏర్పాటు చేస్తున్నామన్నారు. పర్యాటకుల కోసం బోట్ సౌకర్యం కూడా కల్పిస్తున్నామని వివరించారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కృష్ణానది, నల్లమల అటవీ ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పర్యాటకులను ఆకట్టుకుంటామన్నారు. మహబూబ్‌నగర్ లో వీరశైవ లింగాయత్ వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేయడం మంచి పరిణామమని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాతే అధికారికంగా బసవేశ్వరుని జయంతి నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి బసవ భవన్ 3 వేల గజాల్లో బ్రహ్మాండంగా నిర్మించామని తెలిపారు. ట్యాంక్ బండ్ పై బసవేశ్వరుని విగ్రహం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ కోకాపేట్ లో రూ.200 కోట్ల విలువైన భూమి, నిధులు ఇచ్చి బసవ భవన్ నిర్మించామని ఆత్మగౌరవ భవనాలకు తెలంగాణ కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నదన్నారు. బలహీన వర్గాల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదన్నారు. వీరశైవ లింగాయత్ లను ఓబీసీలో చేర్చేందుకు బీఆర్‌ఎస్ ఎంపీ బి.బి పాటిల్ ఆధ్వర్యంలో తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జేపీఎన్‌సీఈ చైర్మన్ కెఎస్ రవికుమార్, వీరశైవ లింగాయత్ ప్రముఖులు వజ్రాలింగం, శంకర్ లింగం, పోకల శివుడు, కొండా వీరన్న, నాగభూషణం, మహేశ్వర స్వామి, రమేష్ పాల్గొన్నారు.

బీవీపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌చందర్

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతామని జిల్లా అధ్యక్షుడు రమేష్‌చందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీవీపీ కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల్లో జాతీయ భావాలు పెంపొందించేలా బృంద గాన పోటీలు, దేశ చరిత్ర, నైసర్గిక స్వరూపం తదితర అంశాలపై భారత్ కో జానో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీవీపీ 60 ఏళ్ల వార్షికోత్సవం సందర్భంగా పాలమూరుశాఖ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. సభ్యులు జి.పాండురంగం, వీఎస్ఆర్‌కే.ప్రసాద్, ఎ.నారాయణరావు భూషణ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని కురిహిని శెట్టి కాలనీలో ఆదివారం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు స్థానిక నాయకులు క్రేన్ తో భారీ పూలమాలతో స్వాగతం పలికారు. అనంతరం జరిగిన ఓ కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎంకు చెందిన పలువురు నాయకులు మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. అంతకుముందు తోట మైసమ్మ ఆలయంలో మంత్రి పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో చేపట్టనున్న మండప నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం 22 వార్డు, 47వ వార్డు పరిధిలోని బీఆర్‌ఎస్ బూత్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. టీచర్స్ కాలనీలో హార్ట్ ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రంలో వేడుకలకు హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ నర్సిములు, ముడా చైర్మన్ ఎంకన్న, శివరాజు, రామలింగం, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా గొర్రెల పంపిణీ పథకం

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను దేశ ప్రజలందరికీ అందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ కృత నిశ్చయంతో ఉన్నారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ సమీపంలో రెండో విడత ఉచిత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జైనల్లీపూర్, కోడూరు, మాచన్‌పల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 18 యూనిట్ల గొర్రెలను అందజేశారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత కులవృత్తులను ఆదుకున్నది సీఎం కేసీఆర్ మాత్రమేనని అన్నారు. కురుమ, యాదవుల జీవితాల్లో మార్పు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల ఏర్పాటు ద్వారా అందిరికీ కేజీ టు పీజీ విద్య ఉచితంగా అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అంది ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటే ఓర్వలేని కొందరు ప్రతిపక్ష నేతలు విద్వేషాలు రాజేస్తున్నారని విమర్శించారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్ గౌడ్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, ముడా డైరెక్టర్ కాడం ఆంజనేయులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, జీజీహెచ్ సలహా మండలి సభ్యుడు సత్యంయాదవ్, పశుసంవర్ధకశాఖ ఏడీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమంగా ప్రహరీ!

● అడ్డుకున్న గ్రామస్తులు


ప్రహరీ నిర్మాణం చేస్తున్నారని చూపిస్తున్న ఉమ్మడి పెద్దయపల్లి గ్రామస్తులు

బాలానగర్: ఉమ్మడి పెద్దాయపల్లి శివారులోని ప్రభుత్వభూమిలో ఓ వెంచర్ నిర్వాహకులు ప్రహరీ నిర్మిస్తున్నారని గ్రామస్తులు, రైతులు ఆదివారం అడ్డుకున్నారు. అదే భూమిలో మార్కెట్‌యార్డు నిర్మాణం కోసం 5 ఎకరాలు కేటాయిస్తే చదును చేసుకొన్నారని పేర్కొన్నారు. విషయంపై సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తామని వివరించారు. కాగా విషయంపై నిర్వాహకులు తమకు ఉన్న 22.07 గుంటల భూమిలోనే వెంచర్ చేసామని, అన్ని అనుమతులు ఉన్నాయన్నారు. తమకు ఒక సెంట్ ప్రభుత్వ భూమి కూడా వద్దన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌ను విషయంపై వివరణ కోరగా వెంచర్ నిర్వాహకులు గతంలో ఏడీ సర్వేతో సర్వే చేయించారని అన్నారు. విషయంపై రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. సర్వే చేయించుకోవాలని సూచించామని వివరించారు. ఒకవేళ ప్రభుత్వ భూమిని ఆక్రమించి వెంచర్ చేసినట్లయితే కఠినచర్యలు తప్పవన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మిడ్జిల్: మండల పరిధిలోని బోయిన్‌పల్లి గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం రోడ్డుపైన నడ్చుకుంటూ వెళ్తున్న ఒరిస్సాకు చెందిన అర్జినాగ్, రాజేందర్‌దీప్‌లను గ్రామానికి చెందిన మంగళగిరి ముఖిత్ ద్విచక్రవాహనంతో ఢీ కొట్టాడు. దీంతో వారు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించిట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ముఖిత్‌పై కేసునమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వివరించారు.

నవాబుపేట సంత.. జేబుదొంగల చింత


నవాబుపేట సంతలో జనం

నవాబుపేట: మండల కేంద్రంలో ప్రతి ఆదివారం జరిగే సంతలో జేబుదొంగల చింత ప్రజలను ఇబ్బందులు పెడుతోంది. వేలాదిమంది సంతకు వస్తుండడంతో అదనుగా భావిస్తున్న దొంగలు చెలరేగుతున్నారని పలువురు వాపోతున్నారు. ఖరీదైన సెల్‌ఫోన్లు, పర్సులు కొట్టేస్తున్నారని అంటున్నారు. కాగా ప్రతివారం బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. కాగా పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినా తిరిగి తమ విలువైన వస్తువులు పొందిన దాఖలాలు లేవని బాధితులు అంటున్నారు. సర్పంచ్ గోపాల్ గౌడ్ ఆదివారం సంతలో ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేయాలని ఎస్‌ఐ పురుషోత్తంను కోరారు.

కాంగ్రెస్‌లోకి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్


కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రాధాఅమర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అమరేందర్‌రాజు తదితరులు ఆదివారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేవంత్ రెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, నాయకులు రాఘవేందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఫక్రుద్దీన్ ఖురేషీ



స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ మైనార్టీ సెల్ మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు మహ్మద్ ఫక్రుద్దీన్ ఖురేషీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీసెల్ అధ్యక్షుడు మహ్మద్ ఫయాజ్ నియమాకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ పటిష్టత, మైనార్టీ విభాగం బలోపేతం కృషి చేయాలని కోరారు. నాయకులు అంతయ్య, అప్పు, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే టోర్నీలో విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని ఫలక్‌నుమాలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కరాటే టోర్నీలో కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఈ పోటీల్లో ఆయా విభాగాల్లో బంగారు, రజత పతకాలు సాధించినట్లు వివరించారు. ఈ మేరకు విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పొరపాట్లు లేకుండా ఓటరు జాబితా


మాట్లాడుతున్న ఆర్డీఓ అనిల్‌కుమార్

మహబూబ్‌నగర్ రూరల్: శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ అనిల్‌కుమార్ కోరారు. ఆదివారం మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో డీఎస్పీ మహేష్, తహసీల్దార్లు, పోలీసు అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జాబితాలో పొరపాట్లు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. 18 ఏళ్లు పూర్తి చేసుకున్న వారు సెప్టెంబర్ 19 వరకు నమోదుకు అవకాశం ఉందని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూత్ స్థాయి అధికారులు ఉంటారని పేర్కొన్నారు. అక్టోబర్ 4న తుది జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. జిల్లాలో కొత్తగా ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. గ్రామాల్లో సంచార వాహనాల ద్వారా ఈవీఎం యంత్రాలపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ అర్బన్, రూరల్ మండలాల తహసీల్దార్లు బి.పార్థసారథి, పాండు, రూరల్ సీఐ స్వామి, ఎస్సై వెంకటేశ్వర్లు, గిర్దావర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలి

దేవరకద్ర: ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని కోరుతూ ఆదివారం తెలంగాణ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు అన్నాసాగర్‌లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. జేఏసీ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

లయన్స్, లియో క్లబ్‌ల ఆధ్వర్యంలో అన్నదానం

స్టేషన్ మహబూబ్‌నగర్: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు ఘట్టమనేని జన్మదినం సందర్భంగా ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబ్‌నగర్, లియో క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 500 భోజన ప్యాకెట్లను పట్టణంలో నిరుపేదలకు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శ్రీహరి, గోవర్ధన్, మృత్యుంజయ, పి.అశోక్‌కుమార్, లియోక్లబ్ అధ్యక్షుడు ఫణింద్ర, ఉపాధ్యక్షులు భరత్, కార్యదర్శి మోహన్, కోశాధికారి భీమేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

మహమ్మదాబాద్: మండల పరిధిలోని నంచర్ల ఉన్నత పాఠశాలలో 2003–04 సంవత్సరంలో చదువుకున్న నాటి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి విద్యార్థులు, గురువులు కిష్టప్ప, అంజిలయ్య, శంకరయ్య, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీవుల్లో మానవులే ఉన్నతులు



జడ్చర్ల టౌన్: విచక్షణా కలిగిన జీవుల్లో మానవులే ఉన్నతులని డా.సి.నారాయణరెడ్డి తన రచనలు, కవితల్లో అనేకమార్లు పొందుపర్చారని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిద్ధారెడ్డి, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్ అభిప్రాయపడ్డారు. ఆదివారం డా.సినారె జయంతి పురస్కరించుకుని పట్టణంలో మహాకవి సినారె కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యవక్తలుగా పాల్గొని ప్రసంగించారు. భావితరాలకు సినారె జీవితం ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో భాగంగా వివిధ జిల్లాలకు చెందిన 12మంది కవులు, కళాకారులు, రచయితలకు రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారాలు అందజేశారు. కళాపీఠం వ్యవస్థాపకుడు రాములు, జాతీయసాహిత్య పరిషత్ సభ్యులు ఉమ్మెంతల, మహేశ్వర్, కిరణ్మయి, రంగయ్య, గోనెల రాధాకృష్ణలు పాల్గొన్నారు. కార్యక్రమంలో అభినయ కూచిపూడి కళానిలయం చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు


మార్కెట్ యార్డు సమీపంలో రోడ్డు పక్కన కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

నవాబుపేట: మండల కేంద్రంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు అంటున్నారు. ఎటువంటి రక్షణ కంచె లేకపోవడం, రోడ్డుకు పక్కను ఉంటుండడంతో ప్రాణాలు అరచేత పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తుతోందని వాపోతున్నారు. ఎస్‌బీఐ బ్యాంక్ పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, అదేవిధంగా మార్కెట్ యార్డుకు అనుకుని మహబూబ్‌నగర్ రోడ్డు పక్కనే ఉన్న మరో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఇప్పటికైనా కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అధికారులు సమస్యలను పరిష్కరించక పోవడంతో ఇటీవల మూగజీవులు ప్రమాదానికి గురై మృతిచెందిన ఘటనలు చోటు చేసుకున్నాయని వాపోతున్నారు. అదేవిధంగా రేకులచౌడాపూర్ సమీపంలోని గుబ్బడిగుచ్చతండాలో రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెలు శిథిలావస్థలో ఉన్నాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

పార్క్ నిర్మాణానికి భూమిపూజ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కోర్టు వెనుక భాగంలోని ఖాళీ స్థలంలో 'ముడా' నిధులు రూ.20 లక్షలతో నిర్మించనున్న పార్కుకు ఆదివారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్‌కుమార్, డిప్యూటీ ఈఈ బెంజిమన్ పాల్గొన్నారు.

మండప నిర్మాణానికి ..

జడ్చర్ల: కోడ్గల్‌లో పోచమ్మ గుడి మండప నిర్మాణ పనులకు ఆదివారం జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య భూమిపూజ చేశారు. దాదాపు రూ. 4 లక్షల జెడ్పీ నిధులతో పనులను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మమత, నాయకులు రాంచంద్రయ్య, నర్సిములు, యాదయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

సోయం బాబురావును బహిష్కరించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఎస్టీ రిజర్వేషన్ నుంచి లంబాడీలను తొలగించాలని కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన ఎంపీ సోయం బాబురావును బీజేపీ నుంచి బహిష్కరించాలని గిరిజన విద్యార్థి, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రవి రాథోడ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్ వద్ద సోయం బాబురావు దిష్టి బొమ్మను దహనం చేశారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

సన్నాహక సభకు తరలిన నాయకులు



మిడ్జిల్: జడ్చర్లలో ఆదివారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశానికి మిడ్జిల్ మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు సురేష్, నాయకులు వెంకటయ్య, రాజు, గణేష్, అంజి, శివ, తదితరులు ఉన్నారు.

భగీరథుడి విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలో సగరకుల దైవమైన శ్రీ భగీరథ మహర్షి విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఆదివారం క్యాంపు కార్యాలయంలో నాయకులు కలిశారు. ఈ మేరకు స్పందించిన మంత్రి విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష అదేవిధంగా సంఘం భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఉత్సవ కమిటీ ఎన్నిక

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పట్టణం పాతబజార్ హరిజనవాడ కోటమైసమ్మ బోనాల ఉత్సవం ఆగస్టు 20న నిర్వహిస్తుండటంతో ఆదివారం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుంకసారి చెన్నకేశవులు, ఉపాధ్యక్షులుగా గణేష్, విజయ్, ప్రధాన కార్యదర్శిగా పురుషోత్తం, ప్రచార కార్యదర్శిగా నర్సింహులు, కోశాధికారిగా శిరీష్‌కుమార్, కార్యనిర్వహణ కార్యదర్శిగా శివకుమార్‌లతోపాటు సభ్యులుగా నాగరాజు, చంద్రయ్య, బాల్‌రాజ్, యాదయ్య, జ్ఞానేశ్వర్‌లు ఎన్నికయ్యారు. కమిటీ సలహాదారులుగా పి.మురళి, కౌన్సిలర్ రమేష్, కావలి నర్సింహులు, దుర్గం రాము, శంకర్, వెంకటేష్, జీనురాల సత్యంలు ఎన్నికయ్యారు.

ట్రాలీ ఆటో యూనియన్..

జడ్చర్ల టౌన్: జడ్చర్ల పట్టణంలో ఆదివారం ట్రాలీఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు, కార్మిక నాయకుడు శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మార్కెట్ యార్డులో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో అధ్యక్షుడిగా శాంసుందర్ చౌహాన్, ఉపాధ్యక్షులుగా పెంటయ్య, నరహరి, కృష్ణకుమార్, ప్రధానకార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా బురాన్, సహకోశాధికారిగా మహ్మద్, కార్యదర్శులుగా సత్యం, జంషద్‌లను ఎన్నుకున్నట్లు వివరించారు.

జనసంద్రంగా మైసమ్మ ఆలయం

నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ ఆలయం ఆదివారం జనసంద్రంగా మారింది. పెద్ద ఎత్తున జనం మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేకపూజలు చేశారు. అడవిలో చెట్ల కింద భోజనాలు చేశారు. ప్రకృతిని ఆస్వాదిస్తూ సేదతీరారు.

ప్రభుత్వం స్పందించాలి



కోయిల్‌కొండ: ప్రభుత్వం స్పందించి గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని జేఏసీ మండల కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం రిలేదీక్షల్లో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల సాధనసమితి సభ్యులు పాల్గొన్నారు.

న్యాయం చేయకపోతే అసెంబ్లీని ముట్టడిస్తాం

భూత్పూర్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్య పరిష్కరించి న్యాయం చేయకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూరి అన్నారు. ఆదివారం భూత్పూర్‌లో సమ్మెకు మద్దతుగా మాట్లాడారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు సైతం సమస్య పరిష్కారానికి ముందుకు రావడం లేదని ఆరోపించారు. ఐద్వా జిల్లా నాయకురాలు వి.పద్మ, మైబు, నారాయణ, నర్సింహులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండలంలో కొనసాగిన సమ్మెలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎదురింటి నర్సిములు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.